ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

- ఐదుగురు సిబ్బందికి మెమోలు జారీ
- 'రోగికి గడువు తీరిన సెలైన్' ఫలితం
- విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు: కలెక్టర్
- 'నమస్తేతెలంగాణ' కథనానికి స్పందన

ఖానాపూర్ టౌన్, ఆగస్టు 10: నిర్మల్ జిల్లా ఖానాపూర్ సామాజిక దవాఖానలో కాలం చెల్లిన సెలైన్ ఎక్కించిన ఘటనలో ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేయడంతో పాటు ఐదుగురు సిబ్బందికి మెమోలు జారీ చేశామని కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 'రోగికి గడువు తీరిన సెలైన్' శీర్షికన శనివారం 'నమస్తే తెలంగాణ'లో వార్త ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన కలెక్టర్.. ఘటనపై విచారణ చేపట్టాలని డీఎంహెచ్‌వో రాజేందర్, డీసీహెచ్ఎస్ సురేశ్‌ను ఆదేశించారు. నివేదిక ఆధారంగా ఫార్మసిస్టు సునీత, స్టాఫ్ నర్సు చంద్రకళను విధుల నుంచి తొలగించినట్టు తెలిపారు. దవాఖాన పర్యవేక్షకుడు వంశీ, ఫార్మసిస్టులు శ్రీనివాసాచారి, విజయ్‌కుమార్, వెంకటేశ్, కల్యాణిలకు మెమోలు జారీ చేసినట్టు చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతమవకుండా చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ దవాఖానల నిర్వహణ, మెరుగైన వైద్య సేవలు అందించేందుకుఅందించేందుకు కమిటీలు ఏర్పాటుచేస్తామని కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.

నమస్తే ఎఫెక్ట్

పీఏసీఎస్ సీఈవో, కంప్యూటర్ ఆపరేటర్ సస్పెండ్

- 'ఒకరి ఆధార్.. మరొకరికి రుణం' తప్పిదానికి ఫలితం
- రుణమాఫీకి ఆధార్ వివరాల నమోదులో పొరపాట్లు
- 'నమస్తే తెలంగాణ' కథనానికి అధికారుల స్పందన

నల్లబెల్లి, ఆగస్టు 10: రైతు రుణమాఫీకి సంబంధించి ఆధార్ మిస్‌మ్యాచ్‌కు కారకులైన ఇద్దరు పీఏసీఎస్ సిబ్బందిని సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల పీఏసీఎస్ కార్యాలయంలో డీసీసీ బ్యాంకులో రుణాలు పొందిన రైతుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించడంలో అనేక పొరపాట్లు జరిగాయి. ఒకరి ఆధార్ మరో రైతు బ్యాంకు ఖాతాకు మిస్‌మ్యాచ్ కావడంతో కొంతమంది రైతులు రుణమాఫీకి నోచుకోలేదు. దీనిపై 'నమస్తే తెలంగాణ' జూలై 30న 'ఒకరి ఆధార్.. మరొకరికి రుణం' శీర్షికతో మెయిన్‌లో కథనాన్ని ప్రచురించింది. స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆధార్ మిస్‌మ్యాచ్‌పై విచారణ చేపట్టాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఆధార్ నమోదులో జరిగిన అవకతవకలతో రుణమాఫీకి అనర్హులుగా మారిన రైతులను గుర్తించి సరైన ఆధార్ నంబర్లను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కోరింది. కలెక్టర్ పీఏసీఎస్ కార్యాలయానికి విచారణ అధికారిగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ కీరూనాయక్‌ను నియమించారు. ఆధార్ మిస్‌మ్యాచ్‌కు పీఏసీఎస్ సీఈవో మొగిలితోపాటు కంప్యూటర్ ఆపరేటర్ వైనాల రాజును కారకులుగా గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపారు. దీంతో సీఈవో, కంప్యూటర్ ఆపరేటర్‌ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రుణమాఫీ సంగతేంది?

ఆధార్ మిస్‌మ్యాచ్‌కు కారకులను సస్పెండ్ చేయడం సరే గానీ.. రుణమాఫీ సంగతేంది? ప్రభుత్వం ఆగమేఘాల మీద ఇచ్చిన ఆదేశాలతో ఆధార్ నమోదు ప్రక్రియలో పీఏసీఎస్ సిబ్బంది పొరపాట్లు చేసింది. దీంతో మాకు రుణమాఫీ కాలేదు. బాధ్యులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటే సరిపోదు. నాలాంటి వారికి రుణమాఫీ వర్తించేలా చర్యలు చేపట్టాలి.

-బాధిత రైతు, సమ్మయ్యనాయక్, ముచ్చింపుల తండా

జలవిద్యుత్తు ఉత్పత్తిని పెంచండి: భట్టి

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో జల (హైడల్) విద్యుత్తు ఉత్పత్తిని పెంచాలని విద్యుత్తు శాఖ అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. అన్ని ప్లాంట్లల్లో గరిష్ఠ విద్యుత్తు ఉత్పత్తిని సాధించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కృష్ణా, గోదావరి పరివాహకం, ఇతర ప్రాంతాల్లో నమోదవుతున్న వర్షపాతాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యుత్తు ఉత్పత్తిని పెంచాలని తెలిపారు. శనివారం ప్రజాభవన్‌లో థర్మల్, హైడల్ విద్యుత్తు ఉత్పత్తి తీరుపై ఆయా శాఖల చీఫ్ ఇంజినీర్లతో సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ థర్మల్ పవర్ ప్రాజెక్టుల్లో 17 రోజుల విద్యుత్తు ఉత్పాదనకు సరిపడా బొగ్గు నిల్వలను అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. విద్యుత్తు కేంద్రాల పరిస్థితి, ఉత్పాదనకు సంబంధించిన నివేదికలను వారానికోసారి తనకు పంపాలని ఆదేశించారు. సమస్యలుంటే వెంటనే విద్యుత్తుశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి సమాచారాన్ని అందించాలని, సీఈలు నిర్లక్ష్యం వహిస్తే రాతపూర్వక వివరణ తీసుకోవాలని తేల్చిచెప్పారు. సమీక్షలో విద్యుత్తుశాఖ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాస్‌రావు, ఓఎస్డీ సురేందర్‌రెడ్డి, జెన్‌కో డైరెక్టర్లు, సీఈలు పాల్గొన్నారు.

కార్మికశక్తిలో తెలంగాణ జోరు

- పలు అంశాలలో జాతీయ సగటు కంటే ఉన్నతం
- తెలంగాణలో కార్మికుల భాగస్వామ్యం 66.5 శాతం
- జాతీయ సగటు 61.6 శాతానికే పరిమితం



హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో కార్మిక శక్తి పుష్కలంగా ఉన్నది. లేబర్ మార్కెట్ సూచికల్లో రాష్ట్ర కార్మిక శక్తి జోరును ప్రదర్శిస్తున్నది. నిరుద్యోగిత, పురుషుల కార్మిక శక్తి అంశాల్లో మినహా మిగతా అన్ని అంశాల్లో జాతీయ సగటు కంటే ఉన్నతస్థాయిలో సాగుతున్నది. 2024-25 సామాజిక ఆర్థిక గణాంకాల ప్రకారం.. తెలంగాణ లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేటు (ఎల్ఎఫ్‌పీఆర్) జాతీయ సగటు (61.6%)ను అధిగమించి 66.5 శాతానికి చేరింది. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఎంతో దోహదపడుతున్నది. పీరియాడిక్ లేబర్ సర్వే ప్రకారం.. మహిళా శక్తిలో జాతీయ సగటు 39.8 శాతంగా, తెలంగాణలో 50.4 శాతంగా ఉన్నది. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో మహిళా ఎల్ఎఫ్‌పీఆర్ 64.4% కాగా.. జాతీయ సగటు 44.3% మాత్రమే. రాష్ట్రంలో పురుషుల ఎల్ఎఫ్‌పీఆర్ 81.8 శాతంగా నమోదవగా..జాతీయ సగటు 83.2 శాతంతో కాస్త మెరుగ్గా ఉన్నది.

తెలంగాణలో 63.4% మందికి ఉపాధి

ఉపాధి పొందిన వ్యక్తుల శాతాన్ని డబ్ల్యూపీఆర్ సూచిస్తుంది. ఇది తెలంగాణలో 63.4 శాతంగా, జాతీయ సగటు 59.5 శాతంగా ఉన్నది. నిరుద్యోగ రేటు విషయంలో తెలంగాణ (4.6%) కంటే జాతీయ సగటు (3.4%) మెరుగ్గా ఉన్నది. రాష్ట్రంలోని వయోజనుల్లో 47.3% మంది వ్యవసాయంలో నిమగ్నమై ఉండగా.. 33% మందికి సేవా రంగం, 19.7% మందికి పారిశ్రామిక రంగం ఉపాధిని కల్పిస్తున్నాయి.

లేబర్ మార్కెట్ అంటే

జాబ్ మార్కెట్‌నే లేబర్ మార్కెట్ అని అంటారు. ఒక దేశం లేదా ప్రాంతంలో కార్మికులు/ఉద్యోగులకున్న డిమాండ్, వారి సరఫరాను జాబ్‌మార్కెట్‌గా చెప్తారు. ప్రతి దేశానికి లేబర్ మార్కెట్ ఎంతో కీలకం. జాబ్ మార్కెట్‌లో కంపెనీలు, సంస్థలు(ఎంప్లాయర్స్) డిమాండ్‌ను సృష్టిస్తే.. కార్మికులు/ఉద్యోగులు (ఎంప్లాయీస్) ఉత్పత్తిని అందిస్తారు.

2024-25 సామాజిక, ఆర్థిక గణాంకాల ప్రకారం ..

	తెలంగాణలో (%)	జాతీయ సగటు (%)
మహిళా ఎల్ఎఫ్‌పీఆర్	50.4	39.8
పురుషుల ఎల్ఎఫ్‌పీఆర్	81.8	83.2
కార్మిక జనాభా నిష్పత్తి	63.4	59.5
నిరుద్యోగిత	4.6	3.4

కాంగ్రెస్‌లో రాజ్యసభ రగడ

- తెరపైకి అభిషేక్ సింఘ్వి పేరు
- సీనియర్లకు సీఎం రేవంత్ చెక్
- రగిలిపోతున్న ఆశావహులు
- అందెశ్రీకి ఆఫర్ ఏమైనట్టు?
- సింఘ్వితో లాభం ఎవరికి?

అభిషేక్ మను సింఘ్వి

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో రాజ్యసభ రగడ కొనసాగుతున్నది. సీనియర్ నేత కే కేశవరావు రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి ఉప ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, కేశవరావు ఎంపీ పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరడం, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులు కావడంతో ఆ స్థానం కోసం ఆశలు పెట్టుకున్న సీనియర్లు ఆకస్మికంగా సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి పేరు తెరపైకి రావడంతో కంగుతిన్నారు. దశాబ్దాలుగా పార్టీనే నమ్ముకొని, పార్టీ కోసం పనిచేసిన వారిని కాదని ఇతర రాష్ట్రాల నేతలకు అవకాశం ఇవ్వడం ఏమిటని సీనియర్లు ప్రశ్నిస్తున్నారు. నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జైరాం రమేశ్‌కు ఉమ్మడి రాష్ట్ర నుంచి రాజ్యసభకు అవకాశం కల్పించినట్టే, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి అధిష్ఠానం భుజాల మీద తుపాకీ పెట్టి రాష్ట్రంలోని సీనియర్ల ఆశలపై కాల్పులు జరిపారని ఆశావహులు మండిపడుతున్నారు.

ఒక్కొక్కరినీ తప్పిస్తూ..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధిష్ఠానంతో నేరుగా సంబంధాలున్న పార్టీ సీనియర్ నేతలెవరినీ ఆ ఛాయలకు కూడా పోనివ్వని రీతిలో వ్యవహరిస్తున్నారనే ప్రచారం సాగుతున్నది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడానికి తెరవెనుక క్రియాశీలకంగా పనిచేసిన పార్టీ సీనియర్ నేతలు, ఇతర ముఖ్యులకు వారి వారి స్థాయిని బట్టి పెద్దల సభకు పంపుతామని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో హామీ ఇచ్చారు. మాజీ ఎంపీలు రామసహాయం సురేందర్‌రెడ్డి, వీ హన్మంతరావు, మాజీ మంత్రులు కోదండరెడ్డి, జానారెడ్డి సహా పలువురు పార్టీ నేతలు రాజ్యసభ స్థానం ఆశిస్తున్నారు. ఇప్పటికే రామసహాయం సురేందర్‌రెడ్డి కొడుకు ఖమ్మం ఎంపీగా ఎన్నికకాగా, జానారెడ్డి ఇద్దరు కుమారుల్లో ఒకరు ఎంపీగా, మరొకరు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కేకే ఖాళీ చేసిన స్థానానికి తమ పేరును పరిశీలించాలని వీ హన్మంతరావు, కోదండరెడ్డి సహా పలువురు నేతలు అధిష్ఠానాన్ని కోరుతున్నారు. అందరి అంచనాలను తారుమారు చేస్తూ.. అభిషేక్ మను సింఘ్విని రాష్ట్రం నుంచి రాజ్యసభకు పంపిస్తామని స్వయంగా రేవంత్‌రెడ్డే అధిష్ఠానానికి హామీ ఇచ్చారని ప్రచారం జరుగుతున్నది.

సింఘ్వితో లాభం ఎవరికి?

అభిషేక్ మను సింఘ్వీ పేరు రాష్ట్రం నుంచి రాజ్యసభకు తెరపైకి రావడంతో రాష్ట్ర కాంగ్రెస్‌లో ఆసక్తికరమైన చర్చ సాగుతున్నది. దేశంలో ప్రముఖ న్యాయవాదిగా అభిషేక్‌కు పేరున్నది. దేశంలో అతి చిన్న వయసులోనే భారత అదనపు సోలిసిటర్ జనరల్‌గా పనిచేసిన రికార్డు ఉన్నది. ఇటువంటి న్యాయకోవిదుడిని రాష్ట్రం నుంచి రాజ్యసభకు నామినేట్ చేయడానికి అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటే తమకేం అభ్యంతరం లేదని, అదే సమయంలో తమకు అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరే హక్కు తమకు ఉన్నదని పార్టీ సీనియర్ నేతలు పేర్కొంటున్నారు. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే ఈ పేరును సూచించడంలో 'ఓటుకు నోటు కేసు' వ్యవహారం దాగున్నదనే ప్రచారం గాంధీభవన్ సహా పార్టీ సీనియర్ నేతల్లో జోరుగా సాగుతున్నది.

అందెశ్రీకి ఆఫర్ ఏమైనట్టు?

ఎన్నికల సమయంలో కోదండరాంరెడ్డి, అందెశ్రీలకు రాజ్యసభ ఎంపీలుగా అవకాశం కల్పిస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్టు సమాచారం. 'ఎటువంటి పరిస్థితులు ఎదురైనా సరే మీ ఇద్దరినీ నా రెండు కండ్లుగా భావిస్తా. దేశంలో మేధావులు, వివిధ రంగాల విషయ నిపుణులు ఉండే స్థానంలో మిమ్మల్ని నిలబెట్టే పూచీ నాదీ' అని వారికి పరోక్షంగా రాజ్యసభ ఆఫర్ చేశారని ఉద్యమకారులు చెప్తున్నారు. సీఎం తన వైపు నుంచి ఎమ్మెల్సీ పదవికి క్లియర్ చేసినా, గవర్నర్ దగ్గర ఫైల్ ఉన్న నేపథ్యంలో కోదండరాంకు ఏమనాలో పాలుపోని పరిస్థితి నెలకొన్నది. కోదండరాంకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాళ కాకపోయినా, రేపపక్కా అనే వాతావరణం నెలకొనడంతో తరువాత స్థానం అందెశ్రీది అని ఉద్యమకారులు భావించారు. ఎన్టీఆర్ హయాంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత సీ నారాయణరెడ్డిని రాజ్యసభకు నామినేట్ చేసినట్టే, అందెశ్రీకి కూడా ఆ అవకాశం తప్పకుండా లభిస్తుందని ఆశించారు. అయితే, ఆకస్మికంగా అభిషేక్ మను సింఘ్వీ పేరు తెరపైకి రావడం, ఆ పేరును సూచించిందే సీఎం రేవంత్‌రెడ్డి అని ప్రచారం కొనసాగడంతో అటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు, ఇటు ఉద్యమకారులు ఒక్కసారిగా విస్మయానికి గురవుతున్నారు.

ఫైలేరియా నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ

- మంత్రి రాజనర్సింహ

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ అమలుచేస్తున్నట్టు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. జాతీయ ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా కేంద్ర ఆయుష్, వైద్యారోగ్య శాఖ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ నిర్వహించిన సమీక్షలో రాష్ట్రం నుంచి మంత్రి దామోదర హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేపడుతున్న చర్యలను వివరించారు. సంగారెడ్డి, మహబూబాబాద్ జిల్లాల్లోని 14 పీహెచ్‌పీల పరిధిలో ప్రజలకు బోధకాలు, నులిపురుగుల నివారణకు డీఈసీ, ఆల్బెండజోల్, ఐవర్‌మెక్టిన్ మాత్రల పంపిణీని ప్రారంభించారు. హెల్త్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా పాల్గొన్నారు.

తెలంగాణలో టీడీపీని విస్తరిస్తాం: చంద్రబాబు

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో తెలుగుదేశం పార్టీని మళ్లీ విస్తరిస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు చెప్పారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో శనివారం రాష్ట్రంలోని ముఖ్యనాయకులతో చర్చించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో టీడీపీ అభివృద్ధిపై సమాలోచనలు చేస్తున్నట్టు చెప్పారు. తెలంగాణలో ఏ పార్టీతో పొత్తులో ఉంటాం.. ఏ కూటమిలో కొనసాగుతాం అనే విషయాలు ఇప్పుడే వెల్లడించలేనని అన్నారు.

నేను వేసిన పునాదుల వల్లే..

'ఆ రోజు నేను వేసిన పునాది వల్ల తెలంగాణ నేడు తలసరి ఆదాయంలో నంబర్ వన్‌గా నిలిచింది. నేను ఒక్కడ్నే చేశానని చెప్పడం లేదు.. నా తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు కూడా దాన్ని ముందుకు తీసుకెళ్లారు' అని చంద్రబాబు చెప్పారు. రెండు రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారానికి మళ్లీ తెలంగాణ సీఎంను కలుస్తానని చెప్పారు.

కొండల్‌రెడ్డి బాకీ లేడు: డేవిడ్

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడు కొండల్‌రెడ్డి తన వద్ద 58,500 యూఎస్ డాలర్ల అప్పు తీసుకున్నట్టు యూట్యూబ్ వీడియోలో ఆరోపణలు చేసిన ఎన్నారై డేవిడ్ తాజాగా వివరణ ఇచ్చారు. కొండల్‌రెడ్డి మీద తాను చేసిన ఆరోపణలు అవాస్తవమని పేర్కొన్నారు. 'తెలంగాణలో ఎన్నికలకు ముందు కొందరు వ్యక్తులు ప్రలోభపెట్టడం వల్లే నేను వీడియో చేశాను. నా వయస్సు 80 ఏండ్లు. నేను మెడిసిన్ తీసుకుంటాను. అప్పుడప్పుడు అన్‌కాన్షియస్ ఉండటం వల్ల ఈ వీడియోను నేను చేయాల్సి వచ్చింది. కొండల్‌రెడ్డి నాకు ఎలాంటి డబ్బులు ఇవ్వాల్సింది లేదు' అని తాజా వీడియోలో డేవిడ్ పేర్కొన్నారు.

నేడు 'సీతారామ' ట్రయల్ రన్

- 15న సీఎంతో మూడు పంప్‌హౌజ్‌ల ప్రారంభం
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ట్రయల్‌రన్‌ను ఆదివారం నిర్వహిస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఈ నెల 15న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రాజెక్టుకు చెందిన మూడు పంప్‌హౌజ్‌లను ప్రారంభించనున్నట్టు తెలిపారు. సచివాలయంలో శనివారం సీతారామ ప్రాజెక్టుపై మంత్రి సమీక్ష నిర్వహించారు. 15న ఖమ్మం జిల్లా వైరాలో భారీ బహిరంగసభ ఏర్పాటు చేస్తామని చెప్పారు. పెండింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు 67 టీఎంసీల గోదావరి జలాలను కేటాయించాలని కోరుతూ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిందని, సుప్రీంకోర్టుతోపాటు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖాల అనుమతులపై దృష్టి సారించాలని సూచించారు. నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, సహాయ కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఈఎన్సీ అనిల్‌కుమార్, డిప్యూటీ ఈఎన్సీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మేడిగడ్డ బరాజ్ వద్ద దిగువకు వెళ్తున్న నీరు; రాజన్నసిరిసిల్ల జిల్లా తిప్పాపూర్‌లోని అన్నపూర్ణ పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్ నుంచి బయటకు దుంకుతున్న కాళేశ్వరం జలాలు

కొనసాగుతున్న ఎత్తిపోతలు

నంది రిజర్వాయర్‌లోకి 3,150 క్యూసెక్కుల ఎత్తిపోత.. సాగర్‌కు సందర్శకుల తాకిడి

ధర్మారం/రామడుగు/బోయినపల్లి, ఆగస్టు 10: కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-2లో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. దిగువన పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా నందిమేడారంలోని నంది పంప్‌హౌస్‌కు జలాలు చేరుతుండగా, శనివారం ఒక మోటర్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. అక్కడి నుంచి జంట సొరంగాల ద్వారా కరీంనగర్ జిల్లా లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్‌కు తరలిపోతున్నాయి. ఇక్కడ కూడా ఒకే మోటర్ నడిపిస్తున్నారు. మొత్తం 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తూ శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి తరలిస్తున్నారు. శనివారం సాయంత్రం వరకు ఎల్లంపల్లి నుంచి 13 టీఎంసీలకుపైగా జలాలు మధ్య మానేరుకు తరలించినట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. మధ్యమానేరు జలాశయంలో 27.54 టీఎంసీల నీటి సామర్థ్యానికిగాను ప్రస్తుతం 17.06 టీఎంసీల నీటి నిలువ ఉన్నట్టు అధికారులు తెలిపారు. మధ్యమానేరు నుంచి సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరిలోని అన్నపూర్ణ ప్రాజెక్టుకు నీటిని తరలిస్తున్నారు. మధ్యమానేరు నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా తిప్పాపూర్‌లోని సర్జ్‌పూల్‌కు జలాలు చేరుతుండగా, ఇక్కడ పంప్‌హౌస్‌లో రెండు బాహుబలి మోటర్ల ద్వారా 6,440 క్యూసెక్కులు అన్నపూర్ణ జలాశయానికి చేరుకుంటున్నాయి. ఇక్కడ జలాశయం గేట్లు తెరిచి అంతే మొత్తంలో రంగనాయకసాగర్‌కు వదులుతున్నారు. అన్నపూర్ణ జలాశయంలో 3.5 టీఎంసీల సామర్థ్యానికిగాను ప్రస్తుతం 1.25 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.

సాగర్‌కు పోటెత్తుతున్న వరద

కృష్ణాకు వరద ప్రవాహం తగ్గడం లేదు. శనివారం జూరాల ప్రాజెక్టుకు 1.90 లక్షలు ఇన్‌ఫ్లో, 1.71 లక్షల అవుట్‌ఫ్లో నమోదైంది. శ్రీశైలం జలాశయానికి 1.86 లక్షల క్యూసెక్కుల వరద రాకతో 6 గేట్ల ద్వారా 2,23,142 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. నాగార్జునసాగర్‌కు 3,55,590 క్యూసెక్కులు వస్తుండగా 26 క్రస్ట్‌గేట్లు ఎత్తి 3,12,756 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌లో కృష్ణమ్మ అందాలను వీక్షించేందుకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు. కాగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బరాజ్‌కు శనివారం 3,41,350 క్యూసెక్కుల వరద రాగా, మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో దిగువకు విడుదల చేస్తున్నారు. అన్నారం బరాజ్‌కు 4 వేల క్యూసెక్కులు వస్తుండగా, మొత్తం 66 గేట్ల ద్వారా అంతే మొత్తంలో వదులుతున్నారు. కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద గోదావరి శనివారం సాయంత్రం 3.41లక్షల క్యూసెక్కుల మేర ప్రవహిస్తున్నది.

నాగార్జునసాగర్ డ్యామ్ వద్ద సెల్ఫీ దిగుతున్న మహిళ

కోటి ఎకరాలకు రైతుభరోసా కోత!

మొదటిపేజీ తరువాయి...

సాయం అందజేస్తే, ఈ బడ్జెట్ కోటి ఎకరాలకు మాత్రమే సరిపోతుంది. దీంతో మిగిలిన భూమికి కోత పెట్టడం ఖాయమని స్పష్టమవుతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి సీజన్‌లో 69 లక్షల రైతులకు సంబంధించిన 1.53 కోట్ల ఎకరాలకు రైతుబంధు అందజేసింది. ఏడాదికి సుమారు 3 కోట్ల ఎకరాలకు రైతుబంధు పంపిణీ చేసింది.

సీజన్‌కు 50 లక్షల ఎకరాలకు కోత!

బీఆర్ఎస్ ప్రభుత్వం సీజన్‌కు ఎకరానికి రూ.5 వేల (ఏడాదికి రూ.10 వేలు) చొప్పున ఏటా రూ.15 వేల కోట్లు రైతుల ఖాతాల్లో ఎటువంటి పైరవీలు, షరతులు లేకుండా జమ చేసింది. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఈ మొత్తాన్ని సీజన్‌కు రూ.7,500 చొప్పున ఏడాదికి రూ.15 వేలకు పెంచుతామని హామీ ఇచ్చింది. ఈ లెక్కన ఒక్కో సీజన్‌కు 1.53 కోట్ల ఎకరాలకు రైతుభరోసా అందించేందుకు సుమారు రూ.11,475 కోట్లు, ఏడాదికి సుమారు రూ.23 వేల కోట్లు అవసరం. కానీ, బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు మాత్రమే కేటాయించడం గమనార్హం. ఈ లెక్కన ఏడాదికి రెండు కోట్ల ఎకరాలకు మాత్రమే రైతుభరోసా పంపిణీ చేయనున్నది. గతంతో పోల్చితే ఏడాదికి కోటి ఎకరాలకు కోత పెట్టనున్నది. సీజన్‌కు 50 లక్షల ఎకరాలకు రైతుభరోసా వచ్చే అవకాశం లేదు.

భరోసాకు పీఎం కిసాన్ నిబంధనలు!

ఇప్పటికే రుణమాఫీలో రేషన్‌కార్డు లేని వారికి, ఆదాయపు పన్ను చెల్లించేవారికి, ప్రభుత్వ ఉద్యోగులకు కోత పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇకపై రైతుభరోసాలోనూ కోత పెట్టేందుకు రంగం సిద్ధంచేస్తున్నది. ఈ పథకానికి కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం కిసాన్ నిబంధనలనే ప్రామాణికంగా తీసుకునేందుకు కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. అంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలనే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయబోతున్నది! రేవంత్‌రెడ్డి సర్కార్ మోదీ ప్రభుత్వ మార్గాన్ని ఎంచుకుంటే.. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఆదాయ పన్ను చెల్లించేవారికి రైతుభరోసా రావడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతోపాటు రైతుభరోసా భూమికి సీలింగ్ పెట్టాలని కూడా ప్రభుత్వం భావిస్తున్నది. ప్రతి రైతుకు 5 ఎకరాలు లేదా 10 ఎకరాల సీలింగ్ విధించే అంశంపై ఆలోచన చేస్తున్నది. ఈ నిబంధన అమలు చేస్తే మరింత మందికి రైతుభరోసాలో కోత పడటం ఖాయం. కోతలపై ఇప్పటికే ప్రభుత్వం సబ్ కమిటీని ఏర్పాటుచేసి జిల్లాల్లో రైతుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా అసెంబ్లీలో చర్చించిన తర్వాత రైతుభరోసా అమలుచేస్తామని ముఖ్యమంత్రి, మంత్రులు చెప్తున్నారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నప్పటికీ కమిటీ రైతుభరోసాపై నివేదిక అందించలేదు. దీంతో ఈ అసెంబ్లీ సెషన్‌లో రైతుభరోసాపై చర్చ ఉంటుందా? లేదా? అనే సందేహం వ్యక్తమవుతున్నది. దీనిపై ప్రభుత్వం కూడా ఇప్పటివరకు స్పష్టత ఇవ్వకపోవడంతో అనుమానాలు పెరుగుతున్నాయి.

లైంగిక దాడిపై అలా అనలేదు

అధికారుల సమాచారాన్ని ప్రస్తావించా.. అంధబాలిక ఘటనపై మంత్రి సీతక్క

హైదరాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): మలక్‌పేటలోని ప్రభుత్వ అంధబాలికల హాస్టల్లో బాలికపై లైంగిక దాడి జరగలేదని తాను అసెంబ్లీలో చెప్పినట్టు జరుగుతున్న ప్రచారాన్ని మంత్రి సీతక్క ఖండించారు. ఆ రోజు తనకు అధికారులిచ్చిన సమాచారాన్ని మాత్రమే ప్రస్తావించినట్టు తెలిపారు. తాను చెప్పిన మాటలను వక్రీకరించవద్దని హితవు పలికారు. ఇటువంటి సున్నితమైన అంశాల పట్ల బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. అంధబాలికపై లైంగిక దాడి కేసు పురోగతిని మంత్రి సీతక్క సచివాలయంలో శనివారం సమీక్షించారు. నిందితుడిని ఇప్పటికే అరెస్టు చేసినట్టు, దర్యాప్తును వేగవంతం చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. విధుల్లో అలసత్వం వహించిన సిబ్బందిని తొలగించామని చెప్పారు.

కొత్త అంగన్‌వాడీలు మంజూరు చేయండి

ఏజెన్సీ ప్రాంతాల్లో కొత్త అంగన్‌వాడీ సెంటర్లను మంజూరు చేయాలని మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రులతో కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి అన్నపూర్ణాదేవి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను వివరించారు.